

భారత్ మొట్టమొదటి ప్రయత్నంలోనే విజయవంతంగా అంగారకుడి పైకి పంపిన మంగళయాన్ (మామ్) ఉపగ్రహం 2017 జూన్ 19 నాటికి ఆ గ్రహ కక్ష్యలో వెయ్యి రోజులు పూర్తి చేసుకుంది. పీఎస్ఎల్వీ-సీ 25 రాకెట్ ద్వారా ఈ ఉపగ్రహాన్ని 2013 నవంబరు 5 న ఇస్రో ప్రయోగించింది. మరుసటి ఏడాది సెప్టెంబరు 24 న అది అంగారక కక్ష్యలోకి ప్రవేశించింది. నిజానికి అది ఆరు నెలలే పని చేస్తుందని తొలుత భావించారు. కానీ ఇప్పటికీ అది సేవలు అందిస్తోంది. అంగారకుడిని 388 సార్లు చుట్టి వచ్చింది. ఆ గ్రహం మీదున్న రోజు నిడివి ప్రకారం చూస్తే 973 రోజులను పూర్తి చేసుకుంది.

# ప్రతిభ

# అద్భుత కట్టడాల జాబితాలో 'తాజ్' స్థానం?

## కరెంట్ అఫైర్స్



రచయిత

- సీహెచ్. కృష్ణప్రసాద్
విషయ నిపుణులు

**1.** 'సెల్ఫీ విత్ డాటర్' మొబైల్ యాప్‌ను రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ 2017 లో ఏరోజున దిల్లీలో ప్రారంభించారు? (భ్రూణహత్యలు, మగపిల్లలు మాత్రమే పుట్టాలని కోరుకోవడం లాంటి అంశాలపై అవగాహన పెంపొందించడమే ధ్యేయంగా ఈ యాప్‌ను రూపొందించారు. కుమార్తెలతో సెల్ఫీలను తీసుకుని వాటిని అప్‌లోడ్ చేయాల్సిందిగా ప్రణబ్ ముఖర్జీ కోరారు. వాస్తవానికి 2015 లోనే సునీల్ జలగాన్ అనే వ్యక్తి ఈ ఉద్యమాన్ని ప్రారంభించారు. హరియాణాలోని జింద్ జిల్లాలో ఉన్న బీబీపూర్ గ్రామంలో ఈ ఉద్యమం మొదలైంది.)

ఎ) జూన్ 3 బి) జూన్ 5
సి) జూన్ 7 డి) జూన్ 9

**2.** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మూడేళ్ల పరిపాలన గురించి 'మార్నింగ్ విత్ ఎ బిలియన్: ఎనలైజింగ్ నరేంద్ర మోదీస్ గవర్నమెంట్ ఎట్ మిడ్‌టర్మ్' పేరిట పుస్తకాన్ని ఎవరు రచించారు?

ఎ) ఉదయ్ మహోర్కర్ బి) చేతన్ భగత్
సి) అమితవ్ ఘోష్ డి) విక్రమ్ సేథ్

**3.** 2017 జూన్ 9 న ఏ జిల్లాలోని 74- ఉడేగోళం గ్రామంలో ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఏరువాక పౌర్ణమి కార్యక్రమాన్ని ప్రారంభించారు?

ఎ) విశాఖపట్నం బి) అనంతపురం
సి) తూర్పుగోదావరి డి) ప్రకాశం

### షాంఘై సహకార సదస్సు



షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీఓ) వార్షిక సదస్సును 2017 జూన్ 9 న కజకిస్థాన్ రాజధాని ఆస్తానాలో నిర్వహించారు. ఈ సదస్సుకు హాజరైన ప్రధాని నరేంద్ర మోదీ ఉగ్రవాదం మానవాళికి పెనుముప్పుగా పరిణమించిందని పేర్కొన్నారు. సమన్వయంతో గట్టిగా కృషి చేసి, అతివాదం, ఉగ్రవాదులకు ఆర్థిక చేయూత, శిక్షణ లాంటి సమస్యలను పరిష్కరించాలని పిలుపునిచ్చారు.

- ఈ సదస్సులో భారత్, పాకిస్థాన్‌లకు ఎస్‌సీఓలో పూర్తిస్థాయి సభ్యత్వం కల్పించారు. 2001 లో ప్రారంభమైన తర్వాత ఎస్‌సీఓను విస్తరించడం ఇదే తొలిసారి. ప్రపంచంలో 40 శాతానికి పైగా ప్రజలకు, 20 శాతం జీడీపీకి ఇది ప్రాతినిధ్యం వహిస్తోంది.
- 2001 లో షాంఘైలో జరిగిన శిఖరాగ్ర సదస్సులో రష్యా, చైనా, కిర్గిజ్‌స్థాన్, కజకస్థాన్, తజికిస్థాన్, ఉజ్బెకిస్థాన్ దేశాల అధ్యక్షులు ఎస్‌సీఓను స్థాపించారు.
- 2005 లో ఆస్తానా శిఖరాగ్ర సదస్సులో భారత్, ఇరాన్, పాకిస్థాన్‌లకు పరిశీలక హోదా దక్కింది. 2010 లో తాష్కెంట్‌లో జరిగిన సమావేశంలో కొత్త సభ్యత్వాలపై నిషేధాన్ని తొలగించారు. దీంతో కూటమి విస్తరించడానికి మార్గం సుగమమైంది. చైనా ఆధిపత్యం ఎక్కువగా ఉండే ఈ కూటమిలోకి భారత్ ప్రవేశం ఒక కీలక మైలురాయిగా విశ్లేషకులు చెబుతున్నారు.
- కజకస్థాన్ ప్రపంచ ప్రదర్శన - 2017 ను ఎస్‌సీఓ సభ్యదేశాల నేతలతో కలిసి ప్రధాని నరేంద్ర మోదీ సందర్శించారు. భారత్‌తో సహా పదకు పైగా దేశాలు తమ ప్రదర్శనలను ఇందులో ఉంచాయి.
- అఫ్గనిస్థాన్ అధ్యక్షుడు అష్రాఫ్ ఘనీతో నరేంద్ర మోదీ చర్చలు జరిపారు. ఉగ్రవాద సంక్షుభిత అఫ్గాన్‌కు అండగా నిలబడతామని హామీ ఇచ్చారు.
- చైనా అధ్యక్షుడు షీజిన్ పింగ్‌తో మోదీ సమావేశమయ్యారు. రెండు దేశాల ప్రధాన ఆందోళనలను పరస్పరం గౌరవించుకోవాల్సిన అవసరముందని ఈ సందర్భంగా మోదీ పేర్కొన్నారు.

**4.** 2017 జూన్‌లో ఏ రాష్ట్రంలో గూర్ఖాలాండ్ ఉద్యమం తీవ్ర రూపం దాల్చింది?

ఎ) మహారాష్ట్ర బి) మధ్యప్రదేశ్
సి) పశ్చిమ్ బంగ డి) ఉత్తర్ ప్రదేశ్

**5.** 2017 జూన్ 17 నుంచి మూడు రోజులపాటు అభివృద్ధి భారత్ రూపకల్పన ఉత్సవం (మేకింగ్ ఆఫ్ డెవలప్డ్ ఇండియా ఫెస్టివల్ - మోదీ ఫెస్ట్)ను ఎక్కడ నిర్వహించారు?

ఎ) వారణాసి బి) కాన్పూర్
సి) లఖ్‌నవూ డి) ఆనంద్

**6.** 2017 జూన్ 17 న ఏ దేశంతో సంబంధాలను రద్దుచేస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు?

ఎ) ఉత్తర కొరియా బి) సిరియా
సి) క్యూబా డి) పై మూడూ

**7.** ఏ ప్రాజెక్టుకు జలకళ తెచ్చేందుకు రూపొందించిన రివర్స్ పంపింగ్ పథకానికి తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ ఇటీవల ఆమోదం తెలిపారు?

ఎ) జూరాల ప్రాజెక్టు బి) సింగూరు ప్రాజెక్టు
సి) శ్రీరాం సాగర్ ప్రాజెక్టు డి) కొమరం భీమ్ ప్రాజెక్టు

**8.** సిలిండర్ల అవసరం లేకుండా ఇంటింటికీ గొట్టాల ద్వారా వంట గ్యాసును సరఫరా చేసే పథకాన్ని 2017 జూన్‌లో కేంద్ర పెట్రోలియం, సహజ వాయువుల శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఏ నగరంలో ప్రారంభించారు?

ఎ) హైదరాబాద్ బి) బెంగళూరు
సి) చెన్నై డి) కోయంబత్తూరు

### ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ - 2017



ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ - 2017 విజేతగా పాకిస్థాన్ నిలిచింది. 2017 జూన్ 18 న లండన్‌లో జరిగిన ఫైనల్లో టీమిండియాను 180 పరుగుల తేడాతో ఓడించి, తొలిసారి ఛాంపియన్స్ ట్రోఫీ విజేతగా నిలిచింది.

- ఈ విజయంతో ఐసీసీ మూడు టోర్నీలూ గెలుచుకున్న మూడో జట్టుగా పాకిస్థాన్ రికార్డు సృష్టించింది. వన్డే వరల్డ్ కప్, టీ20 వరల్డ్ కప్, ఛాంపియన్స్ ట్రోఫీలను పాక్ కంటే ముందు భారత్, వెస్టిండీస్ గెలుచుకున్నాయి.
- ఒక ఐసీసీ టోర్నీ ఫైనల్లో ఇదే అతి భారీ గెలుపు (180 పరుగుల తేడా) కావడం విశేషం.
- ఫైనల్ మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ ఫకర్ జమాన్ (పాకిస్థాన్), మ్యాన్ ఆఫ్ ద సిరీస్ హసన్ అలీ.
- గోల్డెన్ బ్యాట్ అవార్డు శిఖర్ ధావన్ (అత్యధిక పరుగులు 338), గోల్డెన్ బాల్ అవార్డు హసన్ అలీ (అత్యధిక వికెట్లు 13) గెలుపొందారు.

**9.** 2017 సంవత్సర కార్నెగీ మెడల్ పురస్కారాన్ని ఎవరు గెలుచుకున్నారు? (భారతదేశంలో నాణ్యమైన విద్యను అందించేందుకు ఈయన చేసిన కృషికి గుర్తింపుగా ఈ పురస్కారం దక్కింది. దేశంలోని ఏడు రాష్ట్రాల్లో మూడు లక్షలకు పైగా పాఠశాలలను సకల సౌకర్యాలతో ఈయన అభివృద్ధి చేసినట్లు కార్నెగీ కొనియాడింది.)

ఎ) రతన్ టాటా బి) అజీం ప్రేమ్‌జీ
సి) ముఖేశ్ అంబానీ డి) సునీల్ మిట్టల్

**10.** భవిష్యత్ ఇంధనంగా పేర్కొంటున్న మండే మంచు (ఫ్లేమబుల్ ఐస్)ను సముద్ర గర్భం నుంచి వెలికి తీయడంలో విజయం సాధించినట్లు ఇటీవల ఏ దేశం ప్రకటించింది? (ఒక క్యూబిక్ మీటర్ మండే మంచు 164 క్యూబిక్ మీటర్ల సహజ వాయువుతో సమానమని ఈ దేశ శాస్త్రవేత్తలు వెల్లడించారు. ఇందులో 99.5 శాతం మీథేన్ ఉంటుంది. 10°C కంటే తక్కువ ఉష్ణోగ్రతలో, సాధారణ వాతావరణ ఒత్తిడి కంటే 30 రెట్లు ఎక్కువ ఒత్తిడిలో నీరు, మీథేన్ వాయువు కలిసినప్పుడు మండే మంచు తయారవుతుంది. ఇది తెలుపు రంగులో మంచు ముద్దలా కనిపిస్తుంది. అందుకే దీనికి మండే మంచు అనే పేరు వచ్చింది.)

ఎ) చైనా బి) అమెరికా సి) జపాన్ డి) రష్యా

**11.** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బాధ్యతలు చేపట్టాక తొలి విదేశీ పర్యటనలో భాగంగా ఏ దేశాన్ని సందర్శించారు? (దీంతోపాటు ఈ పర్యటనలో ఇజ్రాయెల్, వాటికన్ సిటీలను కూడా సందర్శించారు.)

ఎ) మెక్సికో బి) సౌదీ అరేబియా
సి) కెనడా డి) యూఏఈ

**12.** జాతీయ మైనారిటీల కమిషన్ (ఎన్‌సీఎం) నూతన ఛైర్మన్‌గా ఇటీవల ఎవరు నియమితులయ్యారు?

ఎ) జార్జి కురియన్ బి) గయారుల్ హసన్
సి) సునీల్ సింఘి డి) సులేఖ కుంభేర్

**13.** ఇండెలిబుల్ ఫుట్ ప్రింట్స్ ఆన్ ద శాండ్స్ ఆఫ్ టైమ్ అనే పుస్తకం 75 ఏళ్లుగా ఏ సంస్థ చేపడుతున్న సేవా కార్యక్రమాలకు సంబంధించింది? (ప్రధాని మోదీ ఈ పుస్తకాన్ని ఆవిష్కరించారు.)

ఎ) రిలయన్స్ బి) ఇన్ఫోసిస్
సి) టాటా డి) విప్రో

### ఫ్రెంచ్ ఓపెన్ - 2017

ఫ్రెంచ్ ఓపెన్ - 2017 పురుషుల సింగిల్స్ టైటిల్ విజేతగా రఫెల్ నాదల్ (స్పెయిన్) నిలిచాడు. జూన్ 11 న జరిగిన ఫైనల్లో 6-2, 6-3, 6-1 తో స్టాన్ వావ్రింకా (స్విట్జర్లాండ్) పై గెలుపొందాడు.

- నాదల్ కెరీర్‌లో ఇది పదో ఫ్రెంచ్ ఓపెన్ టైటిల్ కావడం విశేషం. తద్వారా ఫ్రెంచ్ ఓపెన్‌ను పదిసార్లు గెలిచిన ఏకైక ఆటగాడిగా ఘనత సాధించాడు.
- నాదల్ గతంలో 2005, 2006, 2007, 2008, 2010, 2011, 2012, 2013, 2014 ల్లో ఫ్రెంచ్ ఓపెన్ టైటిల్స్ గెలిచాడు.
- తాజా విజయంతో నాదల్ గ్రాండ్‌స్లామ్ సింగిల్స్ టైటిల్స్ సంఖ్య 15 కు చేరుకుంది. అత్యధిక గ్రాండ్‌స్లామ్ టైటిల్స్ సాధించిన జాబితాలో నాదల్ రెండో స్థానానికి చేరుకున్నాడు. 18 టైటిళ్లతో రోజర్ ఫెదరర్ (స్విట్జర్లాండ్) అగ్రస్థానంలో, 14 టైటిళ్లతో పీట్ సంప్రాస్ (అమెరికా) మూడో స్థానంలో ఉన్నారు.
- విజేతగా నిలిచిన నాదల్‌కు 21 లక్షల యూరోల ప్రైజ్‌మనీ లభించింది.
- మొత్తంమీద నాదల్ కెరీర్‌లో ఇది 73 వ సింగిల్స్ టైటిల్. క్లే కోర్టులపై 53 వది.
- ఒక గ్రాండ్‌స్లామ్‌ను అత్యధికంగా గెలిచినవారిలో మార్గరెట్ కోర్ట్ (ఆస్ట్రేలియన్ ఓపెన్ - 11 సార్లు) ముందున్నారు. తర్వాత రఫెల్ నాదల్ (ఫ్రెంచ్ ఓపెన్ - 10 సార్లు), మార్టినా నవ్రతిలోవా (వింబుల్డన్ - 9 సార్లు) నిలిచారు.

**ఫ్రెంచ్ ఓపెన్ – మహిళలు:**

- ఫ్రెంచ్ ఓపెన్ - 2017 మహిళల సింగిల్స్ విజేతగా జెలెనా ఒస్టాపెంకో (లాత్వియా) నిలిచింది. ఫైనల్లో 4-6, 6-4, 6-3 తో సిమోనా హలెప్ (రొమేనియా)పై నెగ్గింది.
- ఫ్రెంచ్ ఓపెన్ గెలిచిన పిన్న వయస్కురాలిగా (20), ఓపెన్ శకంలో ఫ్రెంచ్ ఓపెన్ నెగ్గిన తొలి అన్‌సీడెడ్ క్రీడాకారిణిగా ఒస్టాపెంకో చరిత్ర సృష్టించింది. ఈమె తను ఆడిన తొలి గ్రాండ్‌స్లామ్ ఫైనల్లోనే విజేతగా నిలిచింది.
- **ఫ్రెంచ్ ఓపెన్ – 2017 ఇతర విజేతలు:** పురుషుల డబుల్స్ - ర్యాన్ హ్యారిసన్ (అమెరికా), మైఖేల్ వీనస్ (న్యూజిలాండ్); పురుషుల డబుల్స్ - లూసీ సఫరోవా (చెక్‌రిపబ్లిక్), బెథనీ మాటెక్ (అమెరికా); మిక్స్‌డ్ డబుల్స్ - రోహన్ బోపన్న (ఇండియా), గాబ్రియేలా డబ్రోస్కీ (కెనడా).
- లియాండర్ పేస్, మహేష్ భూపతి, సానియా మిర్జా తర్వాత గ్రాండ్‌స్లామ్ టైటిల్ గెలిచిన నాలుగో భారత ఆటగాడు రోహన్ బోపన్న. గ్రాండ్‌స్లామ్ మిక్స్‌డ్ డబుల్స్ టైటిల్ గెలిచిన తొలి కెనడా అమ్మాయిగా డబ్రోస్కీ ఘనత సాధించింది.

**14.** పర్యటక సేవలందించే ట్రిప్ అడ్వైజర్ సంస్థ రూపొందించిన ప్రపంచంలోని తొలి పది అద్భుత కట్టడాల జాబితాలో తాజ్‌మహల్ ఎన్నో స్థానంలో నిలిచింది? (కాంబోడియాలోని అంగ్‌కోర్‌వాట్ దేవాలయం ఈ జాబితాలో తొలిస్థానంలో నిలిచింది.)

ఎ) రెండు బి) మూడు
సి) నాలుగు డి) ఐదు

**15.** 2017 మే 26, 27 తేదీల్లో ఏ దేశంలోని తౌర్‌మినాలో 43 వ జీ7 కూటమి సదస్సును నిర్వహించారు?

ఎ) ఇటలీ బి) అమెరికా
సి) కెనడా డి) ఫ్రాన్స్

**16.** ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ 'మన్‌కీ బాత్' రేడియో ప్రసంగాల సంకలన పుస్తకాల ('మన్‌కీ బాత్: ఎ సోషల్ రివల్యూషన్ ఆన్ రేడియో', 'మార్నింగ్ విత్ ఎ బిలియన్ డ్రీమ్స్')కు ఉచితంగా బొమ్మలు వేసిన యూఏఈ దేశానికి చెందిన చిత్రకారుడు ఎవరు?

ఎ) మహ్మద్ అహ్మద్ బి) అక్బర్ సాహెబ్
సి) హసన్ షరీఫ్ డి) హమ్‌దాన్ అబ్రి

**17.** రక్షణ మంత్రి శాస్త్రీయ సలహాదారు జి. సతీష్‌రెడ్డి పదవీకాలాన్ని ప్రభుత్వం ఎంతకాలంపాటు పొడిగించింది? (2017 జూన్ 4 నుంచి ఇది వర్తిస్తుంది. 2015 మేలో ప్రముఖ క్షిపణి శాస్త్రవేత్త సతీష్‌రెడ్డి రెండేళ్ల పదవీకాలానికి ఈ పదవిలో నియమితులయ్యారు.)

ఎ) ఏడాది బి) రెండేళ్లు
సి) మూడేళ్లు డి) నాలుగేళ్లు

**జవాబులు**

| | | | | |
|---|---|---|---|---|
| 1–డి | 5–డి | 9–బి | 13–సి | 17–ఎ. |
| 2–ఎ | 6–సి | 10–ఎ | 14–డి | |
| 3–బి | 7–సి | 11–బి | 15–ఎ | |
| 4–సి | 8–బి | 12–బి | 16–బి | |